క్లుప్తంగా

బీజేపీ నాయకుల నిరసన

హుజూరాబాద్: పట్టణ శివారులోని కేసీ క్యాంపు ఆర్డీవో కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ... దళిత బంధు పథకాన్ని అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ నాయకులు రాజకీయాలకు వేదికగా వాడుకుంటున్నార న్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పథకాన్ని ఓటు బ్యాంకుగా వాడుకునేందుకు ప్రవేశపెట్టిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాన్ని రాజకీయాలకు వాడుకుంటుందన్నారు. అర్హులైన వారికి నిధులు మంజూరు చేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ అధికారి భాస్కర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు గంగిశెట్టి ప్రభాకర్, తూముల శ్రీనివాస్, నల్ల సుమన్, యాంసాని శశిధర్, తిప్పబత్తిని రాజు, అంకటి వాసు, సబ్బని రమేష్, పదారి కొమురయ్య, బొరగాల సారయ్య, గంట సంపత్, వొడ్నాల చంద్రిక, వెంకటేష్, రాజేష్ తదితరులున్నారు.

ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని వినతి

గన్నేరువరం: గుండ్లపల్లి నుంచి వయా గునుకులకొండాపూర్, జంగపల్లి, హన్మాజిపల్లె, మైలారం మీదుగా గన్నేరువరం వరకు ఆర్టీసీ బస్సు సర్వీసును అధికారులు అనివార్యకారణాలతో రద్దు చేశారని, బస్సు సర్వీసును పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు బీజేపీ నాయకులు మంగళవారం కరీంనగర్‌లో వినతిపత్రం ఇచ్చారు. బస్సులేక ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, గుండ్లపల్లి నుంచి ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు డబుల్ రోడ్డు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అజయ్‌వర్మ, గుంటుక శంకర్, పుల్లెల రాము, సామ రాజిరెడ్డి పాల్గొన్నారు.

పనులు చేయించాలని..

హుజూరాబాద్: పట్టణంలో జ్యోతిరావుపూలే, బీఆర్ అంబేడ్కర్ భవనం నిర్మించేందుకు శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభం కాలేదని, పనులు జరిగేలా రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ బీఆర్ అంబేడ్కర్ భవన నిర్మాణ కమిటీ నాయకులు, బీసీ జనగణన కమిటీ నాయకులు మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. 2018లో అప్పటి మంత్రి ఈటల రాజేందర్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వేల్పుల ప్రభాకర్, మార్త రవీందర్, ఆరికెళ్ల ఐలయ్య ఉన్నారు.

అభివృద్ధి పనులపై సమావేశం

ఇల్లందకుంట: ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఇంగిలే రామారావు అధ్యక్షతన, దేవస్థాన కార్యనిర్వహణ అధికారి కె.సుధాకర్ ఆధ్వర్యంలో మంగళవారం సాధారణ సమావేశం నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం తాగునీటి సరఫరా, టూరిజం గదుల మరమ్మతు, రూర్బన్ పథకం ద్వారా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ గదుల ప్రారంభం, ఆలయంలోపల అసంపూర్తిగా ఉన్న సైడ్ డ్రైన్ నిర్మాణం, కొత్తపల్లి క్రాస్ వద్ద ఆర్చీ నిర్మాణం గూర్చి సంబంధిత దేవాదాయశాఖ అధికారులకు లేఖలు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రవికిరణ్, పరమేశ్వర్, శ్రీనివాస్, కిషన్‌రెడ్డి, రాజేందర్, చిరంజీవి, మల్లేష్, రాంరెడ్డి, గోపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, మధూకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, నాగరాజు, దేవస్థాన అర్చకులు శేషం వంశీధరాచార్యులు, మడికొండ నవీన్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

గంగాధర: ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవడంతో పాటు స్వయం కృషితో ఆర్థికంగా ఎదగాలని ఎంపీడీవో రాము సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం మండల సమైఖ్య ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సంబరాల్లో భాగంగా కోటి కుటుంబాల్లో ఆదాయాన్ని పెంచే ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా మండల మహిళా సమాఖ్య సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం స్వయం ఉపాధి పథకాల కోసం రుణాలు మంజూరు చేస్తుందని, ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. బుధవారం నుంచి అన్ని గ్రామాలలో ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సంబరాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో రవికుమార్, ఐకేపీ ఏపీఎం పవన్‌కుమార్, ఎంఈవో ప్రభాకర్‌రావు, ఎంపీవో రమేశ్, వీవోలు, సీసీలు పాల్గొన్నారు.

జాతీయ విద్యార్థి దినోత్సవం

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ హుజూరాబాద్ శాఖ ఆధ్వర్యంలో వృక్షమిత్ర అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణలోని ఖాళీ స్థలంలో విద్యార్థులతో కలిసి స్టూడెంట్ యూనియన్ నాయకులు మొక్కలు నాటారు. విద్యాభివృద్ధి కోసం యూనియన్ చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రోహిత్ నేతాజీ, అజయ్, అభిలాష్, రాజు, సిద్ధార్థ, గౌతమ్, కిరణ్, వెంకటేష్ ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

హుజూరాబాద్: జమ్మికుంట మండలం రామన్నపల్లి గ్రామంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. ఈదురుగాలులు, వర్షాలకు విద్యుత్ స్తంభం పూర్తిగా నేలకొరిగే ఆస్కారం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగు పనులు చేసే సమయంలో విద్యుత్ ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.





హైవేపై నిలిచిన నీటితో అవస్థలు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామంలో హైవేపై వర్షం నీరు నిలిచింది. గొల్లపల్లి –కొత్తగట్టు గ్రామాల మధ్య సర్వీస్ రోడ్డు, హైవేపై ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిలిచింది. పెద్దవాహనాలు వెళ్తుంటే బైక్‌లపై వర్షం నీరు పడటంతో వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారని, రోడ్డుపై వర్షం నీరు నిల్వకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



జమ్మికుంటలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధి బోర్నపల్లిలో...

జననేతకు ఘన నివాళి

హుజూరాబాద్: దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధి బోర్నపల్లిలో వైఎస్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ఎంతోమందికి మేలు జరిగిందన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పేదల అభ్యున్నతికి అహర్నిశలు తపించిన మహానేత అని, ఉచిత విద్య, ఆరోగ్యశ్రీ, రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ల వంటి సంక్షేమ పథకాలు అమలు చేసిన గొప్ప నాయకుడన్నారు. వైఎస్సార్ సేవలు మరవలేనివని, పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు.

ఇల్లందకుంట: కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్ ఆదేశాల మేరకు ఇల్లందకుంటలో పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

చిగురుమామిడి: మండల కేంద్రంలో వైఎస్సార్ జయంతి నిర్వహించారు. మినీ బస్టాండ్‌లో వైఎస్సార్ చిత్రపటానికి పూలు వేసి నివాళి అర్పించారు.



ఇల్లందకుంట మండల కేంద్రంలో...



చిగురుమామిడి బస్టాండ్ ఆవరణలో...



చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి గ్రామ చౌరస్తా వద్ద నవాబుపేట–కోహెడ వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన మిషన్ భగీరథ పైప్‌లైన్ గేట్‌వాల్ చాంబర్ పైకప్పు లేక ప్రమాదకరంగా ఉంది. అదుపుతప్పి పడిపోయే ప్రమాదం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గేట్‌వాల్ చాంబర్‌పై కప్పువేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సురేశ్, మిషన్ భగీరథ ఏఈ, చిగురుమామిడి, సైదాపూర్ సెల్ నంబర్: 7995660378

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

పనులు పూర్తయ్యేవరకు పోరాటం

గన్నేరువరం: కాంగ్రెస్ ప్రభుత్వం గుండ్లపల్లి నుంచి ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు డబుల్ రోడ్డు పనులు పూర్తి చేసే వరకు పోరాటం ఆగదని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. రోడ్డు పనుల నిర్లక్ష్యంపై 12న చేపట్టే బైక్ ర్యాలీ పోస్టర్‌ను మండలంలోని ఖాసీంపేట గ్రామంలో మంగళవారం ఆవిష్కరించారు. అధికారం చేపట్టి 18 నెలలు కావస్తున్నా రోడ్డు పనులు ముందుకుసాగడం లేదని, నాయకులు పనుల పూర్తి చేయడంపై దృష్టి సారించాలని హితవు పలికారు. కంకర, గుంతల రోడ్డుపై ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నా పాలకులకు పట్టింపు లేదని, బీఆర్ఎస్ హయాంలో మంజూరైన రోడ్డు పనులను ఎందుకు పూర్తి చేయడం లేదని మండిపడ్డారు. అనంతరం మైలారం గ్రామంలో ఇటీవల మృతి చెందినవారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సిరిసిల్ల జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, మాజీ జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, మహిళా అధ్యక్షురాలు కుసుంభ నవీన, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, లక్ష్మన్, మహిపాల్‌రెడ్డి, సుధాకర్, రవి, సురేశ్, శంకర్, అంజయ్య, ఈదయ్య, భగవాన్‌రెడ్డి, శ్రీకాంత్, బాలయ్య, మల్లయ్య పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి

రోడ్డు పనులు పూర్తి చేయిస్తాం

గన్నేరువరం: గుండ్లపల్లి నుంచి పొత్తూరు వరకు డబుల్ రోడ్డు పనులు పూర్తి చేయిస్తామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలో మాట్లాడారు. రోడ్డు పనులపై బీఆర్ఎస్ నాయకులకు మాట్లాడే అర్హత లేదన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హ యాంలోనే పనులు పూర్తవుతాయని, ధర్నాలు, బైక్ ర్యాలీ చేసినా ప్రజలు పట్టించుకునే పరిస్థితి లేదని, అడ్డుకునే సంస్కృతి కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులున్నాయని గుర్తు చేశారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మన్మోహన్‌రావు, కోటి, అనంతరెడ్డి సునీల్, అనిల్, శ్రీధర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, తిరుపతి, ప్రదీప్, మల్లేశం, నర్సయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ఇల్లందకుంట: పల్నాటి యుద్ధ వీరుడు మాల కన్నమదాసును అవమానపరిచి మాలల మనోభావాలను దెబ్బతీయడమే కాకుండా కించపరిచే విధంగా వ్యవహరించిన పరకాల సమ్మయ్య గౌడ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిగా కేసు నమోదు చేయాలని మాలమహానాడు ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మాదాసు మొగిలి మాట్లాడుతూ.. మాలకన్నమదాసును అవమానపరుస్తూ ఆయన చిత్రపటంలోని తలస్థానంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తల భాగాన్ని పెట్టి హుజూరాబాద్ యుద్ధవీరుడు అనిరాసి వివిధ వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసిన ఓ టీవీ చానల్‌లో పని చేస్తున్న సమ్మయ్యగౌడ్, అందుకు వత్తాసు పలికిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి లపై కేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కౌశిక్‌రెడ్డి మాలలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గూడెపు ఓదెలు, కనుమల్ల సంపత్,దిలీప్,రామకృష్ణ,శివ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వీణవంక: మండలంలోని కోర్కల్ గ్రామానికి చెందిన నిమ్మల రాజు(40) కుటుంబ కలహాలతో ఈ నెల 1న పురుగుమందు తాగాడు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసుల తెలిపిన వివరాలు.. రాజుకు కన్నాపూర్ గ్రామానికి చెందిన రజితతో 12ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కొడుకు, కూతురు. అల్గునూర్‌లో కూలీ పనులు చేస్తూ జీవనం గడుపుతున్నారు. ఇంట్లో గొడవల కారణంగా గ్రామంలోని ఇంట్లో పురుగుమందు తాగాడు. చుట్టుపక్కలవారు జమ్మికుంటలోని ఓ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడని, తల్లి కనకమ్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తిరుపతి తెలిపారు.

వెంకట్రాజం మృతి తీరనిలోటు

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి గ్రామానికి చెందిన సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు, మాజీ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు వేముల వెంకట్రాజం అనారోగ్యంతో మృతిచెందాడు. మంగళవారం ఉదయం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి వెంకటస్వామి మృతదేహానికి నివాళి అర్పించారు. వెంకట్రాజం మృతి సీపీఐకి తీరనిలోటని అన్నారు. అంత్యక్రియలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, మాజీ జెడ్పీటీసీ అందె స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌కుమార్, గూడెం లక్ష్మి, కసిరెడ్డి మణికంఠరెడ్డి, కిన్నెర మల్లవ్వ, అందె చిన్నస్వామి, కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, బూడిద సదాశివ, కంది రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కోమటిరెడ్డి జయ్‌పాల్‌రెడ్డి, ఉస్మాన్‌పాషా, ఇల్లందుల రాజయ్య పలువురు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని నాయిని చెరువులో కొందరు వ్యక్తులు జేసీబీ సాయంతో మంగళవారం అక్రమంగా మట్టి తవ్వకాలకు పాల్పడ్డారు. చెరువు శివారు ప్రాంతాన్ని ఎంచుకొని ట్రాక్టర్లతో మట్టి తరలిస్తున్నారని సమీపంలోని ప్రజలు అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న అక్రమార్కులు అక్కడ నుంచి జారుకున్నారు. అధికారులు చెరువుల్లో మట్టి తవ్వకాలు చేస్తున్నవారిని గుర్తించి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

సైదాపూర్: మండలంలోని గుజ్జులపల్లి గ్రామానికి చెందిన గీతకార్మికుడు పూదరి అజయ్ మంగళవారం తాటిచెట్టు దిగుతుండగా మోకు జారడంతో కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం హన్మకొండలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

సంక్షిప్త వార్తలు

● **పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం**

జమ్మికుంట: పరిసరాల శుభ్రతతో సీజనల్ వ్యాధులు దరిచేరవని మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ అన్నారు. పట్టణంలోని హరితనగర్‌లో మంగళవారం వంద రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేసే కార్యక్రమం చేపట్టారు. వానాకాలంలో దోమల ఉధృతి ఎక్కువగా ఉంటుందని, ఆయిల్ బాల్స్ వేయడంతో దోమలు వృద్ధిచెందవని, ఓపెన్ ప్లాట్లలో చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని లేదంటే చర్యలు తీసుకుంటామన్నారు.

హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధి ఇప్పలనర్సింగాపూర్ ఎనిమిదో వార్డులో మంగళవారం ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించామని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తెలిపారు.

● **పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి**

వీణవంక: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో మెరుగు శ్రీధర్, స్వచ్ఛ సర్వేక్షణ్ సమన్వయ కర్త రమేశ్ అన్నారు. మండలంలోని ఎల్బాక, వీణవంక గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రధాన వీధుల్లో పరిసరాలను పరిశీలించారు. నీరునిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఇంకుడుగుంతను ప్రతి ఒక్కరూ నిర్మించుకోవాలని, పరిశుభ్రత పాటించాలన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

● **ఎరువుల సరఫరాపై ఆందోళన వద్దు**

జమ్మికుంట : రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలలకు కావాల్సిన ఎరువులను రాష్ట్ర, జిల్లా స్థాయిలో అందుబాటులో ఉంచిందని, యూరియా సరఫరాపై రైతులు ఆందోళన చెందొద్దని హుజూరాబాద్ ఏడీఏ సునీత అన్నారు. మంగళవారం జమ్మికుంట ఏవో ఖాదర్ హుస్సేన్ ఆధ్వర్యంలో జీలుగు సాగు చేసిన రైతు పొలాన్ని సందర్శించారు. పచ్చిరొట్ట వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. కావాల్సినంత యూరియానే వాడుకోవాలని, ఎక్కువవాడితే పంట తెగుళ్ల బారినపడేప్రమాదం ఉందన్నారు.

జమ్మికుంటరూరల్: రైతుల అవసరం మేరకు ఎరువులు అందించాలని తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడు కాయిత లింగారెడ్డి మంగళవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులకు యూరియా అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని లేని పక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు.

● **సద్వినియోగం చేసుకోవాలి**

వీణవంక: దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజనలో భాగంగా మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం నిరుద్యోగులకు ట్రెనింగ్ అండ్ ప్లేస్మెంట్ ప్రోగ్రాం ఉంటుందని ఎంపీడీవో మెరుగు శ్రీధర్ ప్రకటనలో తెలిపారు. మండలంలోని నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శంకరపట్నం: మండలంలోని నిరుద్యోగులకు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన పథకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో కృష్ణప్రసాద్ ప్రకటనలో తెలిపారు.

● **9 నుంచి సైకిళ్ల పంపిణీ**

వీణవంక: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదినం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఈ నెల 9 నుంచి సైకిళ్లు పంపిణీ చేయనున్నామని బీజేపీ మండల అధ్యక్షుడు బత్తిని నరేశ్ గౌడ్ అన్నారు. మండలంలోని చల్లూరు ప్రభుత్వ హై స్కూల్ విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థికి సైకిల్ అందుతుందని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● **ఉచిత వైద్య శిబిరం**

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ విద్యార్థి దినోత్సవం పురస్కరించుకొని స్టూడెంట్ ఫర్ సేవా, సురక్ష ఆసుపత్రి డాక్టర్ తిరుపతి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పరీక్షలు చేసి మందుల పంపిణీ చేశారు.

● **కూరగాయ విత్తనాలు అందజేత**

మానకొండూర్: మండలంలోని అన్నారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఉపాధ్యాయులు కూరగాయ విత్తనాలు, మొక్కలు అందజేశారు. హెచ్ఎం సుదర్శన్ కూరగాయల ఆవశ్యకత గూర్చి వివరించారు.

● **చెక్కులు పంపిణీ**

గంగాధర: మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గంగాధరలో మంగళవారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజిత పంపిణీ చేశారు. పేదలకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందన్నారు.

విద్యుత్ సరఫరా బంద్

వీణవంక: మండలంలోని రెడ్డిపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ సురేశ్ ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపు చేపడుతున్నామని ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయుడికి అభినందన

మానకొండూర్: మండలంలోని పోచంపల్లి మోడల్ స్కూల్ గణిత ఉపాధ్యాయుడు సుమన్ కుమార్ డాక్టరేట్ పొందారు. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లికి చెందిన సుమన్‌కుమార్ గణితంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. వరంగల్ కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. సుమన్‌కుమార్‌ను ప్రిన్సిపాల్ పద్మశ్రీ, టీచర్లు అభినందించారు.

సమ్మె విజయవంతం చేయండి

జమ్మికుంట: దేశ వ్యాప్తంగా బుధవారం నిర్వహించే కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శంకర్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో మున్సిపల్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. సమ్మె ఒక్క రోజుతో ఆగదని, అన్నిరంగాల కార్మికులందరం ఏకమై పోరాడుతామన్నారు. మున్సిపల్ యూనియన్ నాయకులు సంజీవ్, రవి, రమేష్, నరేందర్, సంపత్, సరోజన పాల్గొన్నారు.

రైతు సంఘం మద్దతు

శంకరపట్నం: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు రైతు సంఘం మద్దతు ఇస్తుందని జిల్లా అధ్యక్షుడు వర్ణ వెంకట్‌రెడ్డి తెలిపారు. కేశవపట్నంలో మంగళవారం మాట్లాడారు. కరీంనగర్‌లో సార్వత్రిక సమ్మెలో భాగంగా గీతాభవన్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు వ్యవసాయ కార్మికులు, రైతులు ప్రదర్శనలో పాల్గొంటారని, కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రాల్లో సైతం రైతులు నిరసన చేపట్టనున్నారని వివరించారు. సమావేశంలో రాజిరెడ్డి, వాసుదేవ్, రాము, జనార్ధన్‌రెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

'అల్ఫోర్స్' నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

కొత్తపల్లి: కరీంనగర్, కొత్తపల్లిలోని అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో మంగళవారం అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వి.నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆయా విద్యా సంస్థల్లో ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యావ్యాప్తికి ఎనలేని కృషి చేయడంతో పాటు ఉన్నత స్థానాల్లో నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పలు పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ నాయకుడు, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వుట్కూరి నరేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. నగరంలోని తెలంగాణచౌక్‌లో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కిమ్ ఫహాద్, వాసు కట్ చేసి, బాణాసంచా కాల్చారు. నాయకులు అరుణ్‌కుమార్, శ్రవణ్‌నాయక్, తాళ్లపల్లి శ్రీకాంత్, బత్తిని విష్ణు, ఓరుగంటి కిశోర్, జక్కుల అఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.



నరేందర్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న విద్యార్థులు

తండ్రికి దహనసంస్కారాలు చేసిన కూతురు



ఇల్లందకుంట: కంటికిరెప్పలా చూసుకున్న కన్నతండ్రి అప్పుల బాధతో పురుగు మందుతాగి చనిపోయాడు. కుటుంబానికి పెద్దదిక్కు లేకుండా పోయింది. పుట్టెడు దుఃఖంతో మంగళవారం కూతుళ్లు తండ్రికి దహనసంస్కారాలు నిర్వహించి రుణం తీర్చుకున్నారు. మండలంలోని రాచపల్లికి చెందిన పెద్ది సమ్మయ్య ఈ నెల 7న పురుగు మందు తాగాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు ముగ్గురు శృతి, అక్షయ, పల్లవి పిల్లలు, అర్ధంతరంగా తండ్రి మరణించడంతో బోరున విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.